TGTEL/26/A5513

# వార్త దీపిక

ప్రచురణ : హైదరాబాద్ సంపుటి : 01 సంచిక: 55 02 బుధవారం సెప్టెంబర్ 2026 వెల: 02

## తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

**వాషింగ్టన్,సెప్టెంబర్1 వార్త దీపిక న్యూస్**

అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్ర రాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు.



### హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు..

## ఇక ఇక్కడే గ్లోబల్ విద్య!

- హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు
- భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు
- గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు
- హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి
- సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ఫలితంగా కుదిరిన ఒప్పందాలు

హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్టాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమె రికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్ లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వ విద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్ లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.

...మిగతా 2 లో...



## జిడిపి వృద్ధిరేటు గణాంకాల గారడీ

- ధరలు మోత మోగిస్తుంటే..వృద్ధి ఎలా సాధ్యం
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1 వార్త దీపిక న్యూస్**

భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తు తోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు.



### దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం


# గర్వకారణం...

- స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి
- బంగారాన్ని అనవసరంగా కొనకండి

**న్యూఢిల్లీ,సెప్టెంబర్1 వార్త దీపిక న్యూస్**

భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే.

...మిగతా 2 లో...




### ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు

## వేయడం సరికాదు:

**తన నియోజకవర్గానికి కేటాయించిన నిధుల్లో 94.1 శాతానికి సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయన్న సంజయ్**

**ఏకపక్ష నివేదికలు ఇవ్వడం సరికాదని వ్యాఖ్య**

**క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని హితవు**



ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ 'ఎంపవర్డ్ ఇండియన్' సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు.కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ. 16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి లభించిందన్నారు. అంతేకాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు.స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల కోసం సీఎస్ఆర్ నిధులను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇకనైనా వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సదరు సంస్థకు హితవు పలికారు.




## కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

- కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా
- ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు
- కష్టకాలంలో మేము మాత్రమే కెసిఆర్‌ను వెన్నంటి ఉన్నాం
- కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీమంత్రి వేముల

**నిజామాబాద్,సెప్టెంబర్1 వార్త దీపిక న్యూస్**



కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురిని కలిసి రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉం దని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కెసిఆర్ కు నమ్మకబంట్లుగా ఉన్న వారిని విడదీసి పార్టీని బలహీన పర్చా లన్న ఎజెండాతో కవిత పనిచేస్తు న్నారని ఆయన విమర్శించారు. ఈ సంద ర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు.

TGTEL/26/A5513
వార్త దీపిక

# దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం...

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

# తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

'హెగ్సెత్ అద్భుతంగా పనిచేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్‌గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్‌లో హెగ్సెత్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్‌లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది. అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పలువురు నేతలు ఇప్పటికే అంతర్గతంగా సన్నాహాలు ప్రారంభించి ఉండొచ్చని ట్రంప్ చెప్పారు. ఏది ఏమైనా ట్రంప్ వారసుడిగా అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించనప్పటికీ.. జేడీ వాన్స్, మార్కో రూబియో, హెగ్సెత్ వంటి పేర్లు వినిపిస్తుండటం రిపబ్లికన్ పార్టీలో 2028 పోరుపై ఆసక్తి రేపుతోంది.

# కాంగ్రెస్ అరాచకానికి పాల్పడుతుంది

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ కార్యకర్తల దాడికి గురైన నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న రాంచందర్ రావును పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అత్యంత హేయమని నితిన్ నబీన్ అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు భౌతిక దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నప్పుడు ప్రేక్షక పాత్ర వహించిన పోలీసు యంత్రాంగం... బాధితులకు అండగా నిలిచేందుకు వెళుతున్న ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పే మాటలన్నీ కేవలం ప్రజలను మభ్యపెట్టే నాటకాలని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ఈ దౌర్జన్యాలు, ప్రతిపక్షాలపై దాడులకు తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతారని నితిన్ నబీన్ హెచ్చరించారు. రాంచందర్ రావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# కెసిఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ముందా?

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టుపై మాట్లాడే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు లేదని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కళ్లముందే నీరు కనిపిస్తున్నా ఆ నీటిని ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తుంటే అడ్డుకోలేని పరిస్థితికి ప్రభుత్వ అసమర్థత, అవినీతే కారణమని ఆరోపించారు. తనకు రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించిన మహబూబ్‌నగర్ జిల్లాకు రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో మళ్లీ వలసలు పెరగడానికి ప్రభుత్వ విధానాలే కారణమవుతున్నాయని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా జిల్లా మంత్రులు నోరు మెదపడం లేదని ఆయన మండిపడ్డారు. కళ్ల ముందే నీటి సమస్యలు కనిపిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, పల్లెల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని జగదీశ్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్, తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టామని, ప్రస్తుత ప్రభుత్వం కరెంట్, నీరు అందించడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలపై రేపటి నుంచి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట ప్రారంభమవుతుందని జగదీశ్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యంగా రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ల్గ÷తాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై కేటీఆర్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ రైతు సభ నిర్వహించనున్నట్లు జగదీశ్ రెడ్డి తెలిపారు. ఈ సభకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా మిర్యాలగూడలో కేటీఆర్ రైతు సభను నిర్వహించి తీరుతామని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

మొదటిపేజీ తరువాయి

కవితను కేసీఆర్‌ను కలపడానికి ప్రయత్నం చేసిన, విడగొట్టడానికి ప్రయత్నం చేసిన విషయం కేసీఆర్‌కు బాగా తెలుసు. పార్టీ లైన్ దాటిన తర్వాత కేసీఆర్ కవితను పార్టీ నుంచి వేటు వేశారని అన్నారు. నేను, మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం. 2001 తెలంగాణ ఆవిర్భావానికి ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. టీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అంటేనే టీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చింద్రు.. మధ్యలో పోయింద్రని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత.. ఇప్పుడు కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా.. కవితనా? అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా.. కవితనా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదు. కవిత కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదని చెప్పగలరా? కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో మంతనాలు చేయలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం కవిత చేస్తున్నారు? స్వలాభం కోసం వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని అన్నారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి, పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడంపై స్పందిస్తూ.. రాజకీయంగా సింపతిని గెయిన్ చేయడానికి అని అర్థం అవుతుంది. అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నాం. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయనపైన, కేటీఆర్‌పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కానీ బాధగా అనిపించింది. సొంత లాభం కోసం కవిత మాట్లాడటం పెద్ద బాధగా అనిపించలేదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవితపై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రయోజనాలను సూచించే 'బాకీ కార్డులకు' ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆ హామీలను అమలు చేస్తామని చెప్పిందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల ద్వారా ఎంత మేర బాకీ పడిందో ప్రజలకు తెలియజేస్తూ, ఇచ్చిన హామీలను ఇకనైనా నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'బాకీ కార్డుల పూజ' కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల ముందుంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిడిపి వృద్ధిరేటు గణాంకాల గారడీ

మొదటిపేజీ తరువాయి

దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ. 850 నుంచి రూ. 1,700 కి, అల్యూమినియం ధర రూ. 350 నుంచి రూ. 650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ. 50 వేల నుంచి లక్ష రూపాయిలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికులు ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటీమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపోతుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్రతిధ్వనిస్తున్నారని విమర్శించారు. ఈ వృద్ధి రేటు భారతీయుల సమష్టి శక్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఈ వృద్ధి రేటుకు కొనసాగించేందుకు భారతీయులు దేశీయ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.

మొదటిపేజీ తరువాయి

# ఏకాంత నిర్బంధాన్ని నిలిపివేయండి

ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలను ఏకాంత నిర్బంధంలో ఉంచుతున్నారంటూ దాఖలైన పిటిషన్లను విచారించిన న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇమ్రాన్ ఖాన్ దంపతులను ఒంటరిగా ఉంచే పద్ధతికి స్వస్తి పలికి, జైలు నిబంధనల ప్రకారం సాధారణ సదుపాయాలు కల్పించాలి. ఇమ్రాన్, బుష్రా సమావేశం అయ్యేందుకు అవకాశం కల్పించాలి. జైలు నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యులు ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించాలి. ఆయన కుమారులతో ఫోన్లో మాట్లాడేందుకు తగిన ఏర్పాట్లు చేయాలి.ప్రతిరోజూ క్రమం తప్పకుండా వార్తాపత్రికలు, పుస్తకాలు అందజేయడంతో పాటు, జైలు నిబంధనలకు అనుగుణంగా సరైన వైద్య సదుపాయాలు కల్పించాలి.ఈ ఆదేశాల అమలుపై పూర్తి నివేదికను 15 రోజుల్లోగా సమర్పించాలని అడియాలా జైలు సూపరింటెండెంట్‌ను కోర్టు ఆదేశించింది. అవినీతి కేసుల్లో సుదీర్ఘ కాలంగా శిక్ష అనుభవిస్తున్న ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలకు జైల్లో సరైన వసతులు కల్పించడం లేదంటూ ఆయన కుటుంబ సభ్యులు కొద్దికాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో... హైకోర్టు నుంచి ఈ సానుకూల తీర్పు వెలువడటం గమనార్హం.

మొదటిపేజీ తరువాయి

# చిన్న ఓదాలలో విద్యార్థులకు యూనిఫాంలు అందజేసిన సర్పంచ్ నాగుల శారద రాజయ్య

వార్త దీపిక న్యూస్

మంథని మండలం చిన్న ఓదాల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామ సర్పంచ్ నాగుల శారద రాజయ్య యూనిఫామ్ లు, షూలను మంగళవారం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం,రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రభుత్వ పాఠశాలల పైన వాటిలో చదువుతున్న పిల్లలపైన ఎంతో శ్రద్ధ చూపుతున్నారన్నారు. పాఠశాలలను అభివృద్ధి చేస్తూ, విద్యార్థులకు ఉదయమే టిఫిన్ పెట్టిస్తూ మంచి కార్యక్రమాలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు మా గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సర్పంచ్ శారద తెలిపారు, ఈ యొక్క కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేముల శ్రవణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగుల రాజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి శారద, ఉపాధ్యాయురాలు జ్యోతి లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



# జాతీయ రహదారికి ఇరువైపులా నాటేందుకు మొక్కలు అందజేత

వార్త దీపిక న్యూస్

నాగ్ పూర్ నుండి వరంగల్ వరకు నిర్మిస్తున్న జాతీయ 4 లైన్ల రహదారికి మంథని మండలం కన్నాల, పందులపల్లి శివారులోని రోడ్డుకు ఇరువైపులా చెట్ల పెంపకం కోసం మంగళవారం కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీ (మొక్కల పెంపక కేంద్రం) నుండి కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ సర్పంచ్ మొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, వనసేవక్ స్వప్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు..

# ఇక ఇక్కడే గ్లోబల్ విద్య!


ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి.వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి.ఈ పరిణామంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్?లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం కింద విదేశీ వర్సిటీలకు లభించిన వెసులుబాటును వినియోగించుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది

TGTEL/26/A5513
వార్త దీపిక

# గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్ రావు

**హైదరాబాద్, సెప్టెంబర్ 1, వార్త దీపిక న్యూస్ :**

టిఎన్జీవోస్ కాలనీ ఫేస్2 గచ్చిబౌలి, హైదరాబాద్ లో జరిగిన జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ సోదరుడు తట్టు విశ్వనాథ్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, సీనియర్ నాయకులు నామా రవికిరణ్,మాజి పట్టణ అధ్యక్షులు యాకూబ్, కౌన్సిలర్ లు అబ్దుల్లా, జాకీర్, మహిపాల్, ఎఫ్ఎంఎస్ చైర్మన్ సత్యం ముదిరాజ్, గోవిందపూర్ గ్రామ సర్పంచ్ వెంకట్,నాయకులు రాజేందర్ రెడ్డి, మూర్తుజా,రవి కుమార్, రాజా నరసింహ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.





# ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్, మైనార్టీ మహిళలు

**సంగారెడ్డి, సెప్టెంబర్ 1, వార్త దీపిక న్యూస్ :**

రాఖీ పౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మీయత, సోదరభావం వెల్లివిరిసింది. బ్రహ్మకుమారీస్‌తో పాటు మైనార్టీ మహిళలు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారికి రాఖీ కట్టి, రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ప్రేమాభిమానాలకు ప్రతీక అని చింత ప్రభాకర్ అన్నారు. బ్రహ్మకుమారీస్, మైనార్టీ మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో ఆత్మీయంగా మాట్లాడారు.



# ప్రతి ఒక్క ఓటును సవరణ చేస్తాం. తహసిల్దార్ వాసంతి.

**వార్త దీపిక న్యూస్**

ప్రతి ఒక్క ఓటును పూర్తిస్థాయిలో సవరణ చేయడం జరుగుతుందని కమాన్ పూర్ తహసిల్దార్ ముస్త్యాల వాసంతి అన్నారు. మంగళవారం మండలంలోని జూలపల్లి గ్రామంలో సర్పంచ్ పోల్ దాసరి వనిత- సాయికుమార్ అధ్యక్షతన ఓటర్ సవరణ గ్రామసభ ప్రారంభమైంది. ఇందులో సవరణలో భాగంగా తప్పులు ఉన్న ఓటర్లకు ఎన్నికల కమిషన్ ద్వారా నోటీసులు జారీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా నోటీఐసు స్థితిగతులను తెలుసుకొని ఆయా ఓటర్ యొక్క ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో, పాస్పోర్టు గాని, పాన్ కార్డు కానీ వాటి వివరాలు చూసి ఆయా ఓటర్ యొక్క తప్పులను సరిదిద్దడం జరుగుతుందని తాసిల్దార్ పేర్కొన్నారు. ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి గ్రామంలో గ్రామ గ్రామాన సభలు నిర్వహించి ఆయా గ్రామసభల్లో సవరణ కార్యక్రమం చేయడం జరుగుతుందని తెలిపారు. తగిన డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, ఉప సర్పంచ్ రాజా మహేందర్, సీనియర్ అసిస్టెంట్ సతీష్, జిపిఓ రవీందర్, వార్డు సభ్యులు చొప్పరి సంతోష్, వేముల సత్యనారాయణ కారోబార్ బర్ల భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ క్రాఫ్ట్ సర్వే తప్పకుండా చేయించాలి.

**వార్త దీపిక న్యూస్ .**



కమాన్ పూర్ మండలంలోని రైతులు డిజిటల్ క్రాఫ్ట్ సర్వే తప్పకుండా చేయిం చాలి అని మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ రైతులను కోరారు. ప్రభు త్వం సూచించినటువంటి ఏడు సన్న రకాల బోనస్ పొందాలంటే రైతులు తప్పకుండా విధిగా వారి యొక్క వివరాలను విత్తనాలు కొనుగోలు చేసినటువంటి డీలర్ వద్ద తప్పకుండా నమోదు చేసుకోవాలవెన్యూ గ్రామంలో వాలంటీర్స్ ద్వారా ప్రతి సర్వే నంబర్ను పంటలవారీగా పంట రకం విస్తీర్ణం నమోదు చేయడం జరుగుతుందని కావున రైతులు క్రాఫ్ట్ సర్వే నందు మీ యొక్క పంటలను కచ్చితంగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో రకాలు సాగు విస్తీర్ణం తెలియజేసి నమోదు చేసుకోవాలని ప్రతి రైతు దీన్ని పాటించాలని సూచించారు.

# అవగాహన లేని డాక్టర్లు.. ప్రజల ప్రాణాలతో చెలగాటం..!

**ప్రాణయ సౌకర్యం ఉండదు...**

**పట్టించుకునే అధికారులు కరువు**

**ఆసుపత్రిలో తనిఖీలో డిఎంహెచ్ వో నిర్లక్ష్యం.. ఎందుకు..?**

**ప్రభుత్వం ఆర్ఎంపి డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి**

**శిశువు మృతి... కుటుంబ సభ్యుల అరోపణ**

**నారాయణఖేడ్, తెలంగాణ మంజీరా న్యూస్ :**

కంగ్టి కూడలిలో రోదిస్తున్న తల్లి కంగ్టి మండల పరదిలోని రాసోల్ గ్రామం

అవగాహనా లేక, ఎవరికీ ఆశ్రయించకుండా శిశువు మృతి మండలం లోని రాసోల్ గ్రామానికి చెందిన జెట్టి స్వరూప భర్త బాలాజీ (20)రోజుల శిశువు మృతి చెందిందని తల్లి స్వరూప తెలిపింది, సోమవారం నాడు మండలం లోని తడ్కల్ గ్రామంలో ప్రైవేట్ ఆసుపత్రి బాలాజీ పవర్,డాక్టర్ రాములు దగ్గర వైద్యం చేయించు కున్నామని కానీ తక్కువ కాలేదని, రాత్రి జ్వరం ఎక్కువవ్వడంతో నారాయణ ఖేడ్ ఆసుపత్రి కీ తీసుకెల్లాలని మార్గ మద్యలో మృతి చెందారు. చిన్నారి తల్లి దండ్రుల రోదనలు భోరున కన్నీళ్లు పెట్టుకున్నారు. కంగ్టి మండలంలో కొందరు ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంగ్టి మండల కేంద్రంలో సుమారు 10 నుంచి 15 మంది, తడ్కల్‌లో మరో ఆరుగురు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లోనూ క్లినిక్‌లు కొనసాగుతున్నట్లు సమాచారం. జ్వరం, తలనొప్పి, కంటినొప్పి, ఒళ్లు నొప్పులు వంటి సమస్యలకు కూడా ఇంజెక్షన్లు, మందులు ఇస్తున్నారని, ఎక్కడ నొప్పి ఉంటే అక్కడే ఇంజెక్షన్ వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు ఆర్ఎంపీల వద్ద పనిచేసిన వారు ఆ తర్వాత సొంతంగా క్లినిక్‌లు పెట్టుకుని వైద్యం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీలకు వచ్చిన సమయంలో కొన్ని క్లినిక్‌ల షట్టర్లు మూసివేస్తున్నారని, అధికారులు వెళ్లిన తర్వాత తిరిగి తెరుస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీనిపై అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తే అసలు విషయం బయటపడుతుందని స్థానికులు అంటున్నారు. కంగ్టి ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల వైద్యం ఉన్న రాత్రివేళ అత్యవసర సమయంలో కొందరు ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారని తెలుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలతో కొందరు సిబ్బంది చికాకుగా మాట్లాడుతున్నారనే ఆరోపణలతో కొందరు ఆసుపత్రికి వెళ్లకుండా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో నారాయణఖేడ్, నిజామాబాద్, బీదర్ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు.ఆర్ఎంపీల క్లినిక్‌లపై తనిఖీలు ఎప్పుడు చేపడతారో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెప్పాల్సి ఉంది. ఈ వ్యవహారంపై మండల వైద్యాధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్పందించి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా సీపీఎస్ విద్రోహ దినం







**సంగారెడ్డి, సెప్టెంబర్ 1, వార్త దీపిక న్యూస్ :**

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ లో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సీపీఎస్ విద్రోహ దినం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీజీఈజేఏసీ చైర్మన్ మొహమ్మద్ జావేద్ అలీ, సెక్రటరీ జనరల్ డాక్టర్ వైద్యనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులు తమ వేతనాల నుంచి సంవత్సరాల తరబడి చెల్లించిన మొత్తానికి భద్రత కల్పించడంతో పాటు, పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం గడిపే విధంగా పెన్షన్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు కోరారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ, పెండింగ్ లో ఉన్న డీఏలు, పీఆర్సీ అమలు కోసం ఉద్యోగ సంఘాలు చేస్తున్న పోరాటానికి అన్ని వర్గాల ఉద్యోగులు ఐక్యంగా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ సెక్రెటరీ వేల్పూరు రవి, అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, టీఎన్జీఎస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు నిర్మల రాజకుమారి, హెచ్.డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, రాష్ట్ర పంచాయితీ కార్యదర్శుల అధ్యక్షులు బలరాం, టీజీవో సెక్రెటరీ సంతోష్, తాలూకా అధ్యక్షులు ప్రమోద్ కుమార్, యాదవ్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సాయిలు, సోమశేఖర్, 4వ తరగతి ఉద్యోగ సంఘం అధ్యక్షులు మహమ్మద్ షరీఫ్, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు..

# కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు ??

**బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి విధానాలు మరియు నాయకత్వంపై విశ్వాసంతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.**

**బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో:**

**3వ వార్డు సభ్యురాలు నక్క భాగ్యమ్మ**

**మాజీ వార్డు సభ్యుడు జంగం శేఖర్**

**నక్క సందాస్**

**కాంగ్రెస్ నాయకుడు ఎండీ తాహెర్**

**నక్క నితీష్**

**గుల్లా ఈశ్వర్**

వీరికి జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు గారు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కోహిర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోహిర్ నర్సింలు, బిలాల్‌పూర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బక్షు పటేల్, రాచన్న స్వామి దేవాలయ మాజీ చైర్మన్ రాజు స్వామి, కోహిర్ రాచన్న, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మోకాళ్ల నొప్పులకు ఆయుర్వేదంతో సులభ చికిత్స.. న్యూరోథెరపీతో ఉపశమనం

**వార్త దీపిక న్యూస్**

కేవలం న్యూరోథెరపీతో పాటు సులభమైన, ఖర్చులేని వస్తువులతో మోకాళ్ల నొప్పులను తగ్గిస్తున్నామని పలువురు చికిత్స పొందిన వారు తెలిపారు.ప్రతి మంగళవారం కమిటీ నిర్వాహకులు భక్తులకు ఉచిత మందులు సైతం అందించడంతో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అంతేకాకుండా ఆయుర్వేద మందులు బాగా పనిచేస్తున్నాయని, ఎలాంటి దుష్ప్రభావాలు లేవని చికిత్స పొందిన వారు తెలిపారు.అలాగే వంటింటి దినుసులతో పాటు మూలికల మందులు అందిస్తున్నందుకు ఎంతో ఉత్సాహంతో చికిత్స పొందుతూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆయుర్వేద న్యూరోథెరపీ వైద్యులు డా. ఉమేష్ గుప్తా గారు రోగులకు సేవలు అందించారు.ఇట్టి సేవలను భక్తులు అధిక సంఖ్యలో వినియోగించుకుంటుండటంపై ఆలయ ధర్మకర్తలు అల్లోల మురళీధర్ రెడ్డి, వినోదమ్మలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ క్యాంపులో కమిటీ సభ్యులు గురుస్వామి మూర్తి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



TGTEL/26/A5513
వార్త దీపిక

# ఘనంగా భరత్ సాయి రెడ్డి, పాలక్ పటేల్ ల నిశ్చితార్థం..!

**హైదరాబాద్, సెప్టెంబర్ 1, వార్త దీపిక న్యూస్ :** రంగారెడ్డి జిల్లా వట్టి నాగులపల్లిలోని ఇవంతర కన్వెన్షన్ లో సోమవారం రాత్రి టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి - నిర్మల దంపతుల కుమారుడు భరత్ సాయి రెడ్డితో రమేష్ పటేల్ - మాయ పటేల్ దంపతుల కుమార్తె పాలక్ పటేల్ నిశ్చితార్థం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజ నరసింహ, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు హాజరై



















Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984